## దేశం కోసం శ్రమిస్తే దేశ ద్రోహిగా ముద్రవేశారు..


ఊహించని పరిణామంతో 50రోజులు జైల్లో వేశారు

కానీ, న్యాయమే గెలిచింది..నిర్దోషిగా నిరూపణయ్యింది.

వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఇన్ని అవమానాలు ఎదురైనా ఆయన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోని ధీరుడు

నేడు నారాయణన్ 83వ జన్మదినం సందర్భంగా విశ్వంభర ప్రత్యేక కథనం..

# పడిలేచిన కెరటం నంబి నారాయణన్



-పోతుగంటి వెంకటరమణ, బ్యూరోచీఫ్

“

**ఆయన జీవనం అతి సామాన్యం.. ఆయన ప్రతిభ అసామాన్యం.. ఎన్ని సమస్యలు ఎదురైనా ఎదిగిన ఆయన ప్రయాణం ఎందరికో ఆదర్శం.. గూఢచర్యం ఆరోపణలతో ఆ ఆదర్శ శిఖరం ఒక్కసారిగా నేలకొరిగింది. దేశం కోసం శ్రమించిన ఆయనపై దేశ ద్రోహిగా ముద్రవేశారు..ఆయన్ను కీర్తించిన నోళ్లే దూషించాయి. చప్పట్లు కొట్టిన చేతులే రాళ్లు రువ్వేందుకు సిద్ధమయ్యాయి. దేశం గర్వించదగ్గ ఇస్రో శాస్త్రవేత్త అని అభివర్ణించిన మీడియానే ఆయన్ను దేశ ద్రోహిగా చూపించింది. ఒకే ఒక ఘటనతో ఆయన జీవితం తలకిందులైపోయింది. అయినా, చివరకు న్యాయమే గెలిచింది. ఆ పడిలేచిన కెరటమే నంబి నారాయణన్. సినీ, క్రీడా, రాజకీయ.. ఇలా ఎందరో ప్రముఖుల జీవితాలు వెలుగులోకి వచ్చాయి. వస్తూనే ఉన్నాయి. కానీ, ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం గురించి చాలా మందికి తెలియదు. నేడు ఆయన 83వ జన్మదినం సందర్భంగా నంబి నారాయణన్ గురించి విశ్వంభర ప్రత్యేక కథనం..**

### గాల్లో ఎగిరే వాటిపై నారాయణన్‌కు ఎంతో ఆసక్తి..

నంబి నారాయణన్ 1941 డిసెంబరు 12న తమిళనాడులో ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు కొబ్బరి కుడకలు, కొబ్బరి పీచు వ్యాపారం చేసేవారు. నారాయణన్‌కు ఐదుగురు అక్కలు. చిన్నప్పటి నుంచీ ఆయన చదువుల్లో చురుకుగా ఉండేవారు.ఇంట్లో అందరికంటే చిన్నవారైన నంబి నారాయణన్... చదువులో బాగా రాణించారు. సీనియర్ క్లాసులో టాపర్‌గా నిలిచారు. మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన నారాయణన్ కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొన్నాళ్లు స్థానికంగా ఉన్న చక్కెర కర్మాగారంలో పనిచేశారు. నేలపై నడిచే వాటికంటే గాల్లో ఎగిరే వాటిపై నారాయణన్‌కు ఎంతో ఆసక్తి. వాటి గమనాన్ని స్టడీ చేసేవారు. ఆ జిజ్ఞాసతోనే 1966లో ఇస్రో 'తుంబా ఈక్విటోరియల్ రాకెట్' లాంచింగ్ స్టేషన్‌లో చేరారు. ఆ సమయంలోనే ఆయనకు ఇస్రో ఛైర్మన్ విక్రమ్ సారాబాయ్ పరిచయమయ్యారు. నారాయణన్ ప్రతిభకు విక్రమ్ ఆశ్చర్యపోయారు. అనతికాలంలోనే అంచలంచెలుగా ఎదుగుతూ 'నాసా' ఫెలోషిప్‌ను అందుకున్నారు నారాయణన్. నాసా ఉద్యోగ అవకాశం ఇస్తానన్నా వదులుకుని ఇండియాకు తిరిగొచ్చారు. సాలిడ్ ప్రొపెలెంట్స్ వాడకం అధిక ఖర్చుతో కూడుకున్నది, దాన్ని లిక్విడ్ ఫ్యూయల్ టెక్నాలజీతో అధిగమించవచ్చని అప్పటి ఇస్రో ఛైర్మన్ సతీష్ ధావన్‌కు వివరించారు. అదే సమయంలో అబ్దుల్ కలాంతోనూ నారాయణన్ కలిసి పని చేశారు. సాంకేతికపరంగా అప్పుడప్పుడే అడుగులేస్తోన్న ఇస్రోను ఫ్యూయల్ టెక్నాలజీతో మరింత ముందుకు తీసుకెళ్లాలనుకున్నారాయన. అలా వచ్చిందే క్రయోజెనిక్ ఇంజిన్స్ ఆలోచన. అయితే, ఈ సాంకేతికకు పెట్టింది పేరు అమెరికా, రష్యా, ఫ్రాన్స్. దాంతో ఆయా దేశాల నుంచి ఆ టెక్నాలజీని దిగుమతి చేయాలనుకున్నారు. చివరకు రష్యాతో రూ. 235 కోట్ల ఒప్పందం కుదిరింది. అంతా సవ్యంగానే జరుగుతుందనుకునేలోపు నారాయణన్‌కు ఎదురుదెబ్బ తగిలింది.



### ప్రభుత్వ పరిహారం కోరుతూ కేరళ ప్రభుత్వంపై కేసు..

తనపై ఆరోపణలు చేసి, అక్రమంగా కేసును బనాయించినందుకు కేరళ ప్రభుత్వంపై నారాయణన్ కేసు వేశారు. రూ. 50 లక్షలు పరిహారంగా చెల్లించాలని సుప్రీంకోర్టు 2018లో ఆదేశించింది. తన తప్పు తెలుసుకున్న ప్రభుత్వం ఆ రూ. 50 లక్షలేకాకుండా కోటి 30 లక్షలు రూపాయలు చెల్లిస్తామని 2019లో తెలిపింది. ఆయనపై అక్రమ కేసు పెట్టడంలో కేరళ పోలీసుల పాత్రపై విచారణ జరపాలని 2018లో సుప్రీంకోర్టు ఆదేశించింది. 2019లో భారత ప్రభుత్వం నారాయణన్‌ను పద్మ భూషణ్‌తో సత్కరించింది.

### మిస్టరీ వీడలేదు..!


నారాయణన్‌పై కుట్ర పన్నిన వ్యక్తుల వివరాలు ఇప్పటికీ తెలియలేదు. అదొక మిస్టరీగా మారింది. అధునాతమైన సాంకేతికతో భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా పేరొస్తుందన్న నెపంతోనే అగ్ర దేశాలు ఇలా చేసి ఉండొచ్చనేది ప్రచారంలో ఉన్న మాట. నిర్దోషి అని తేలినంత మాత్రాన పోయిన పరువు, అత్యంత విలువైన కాలం తిరిగిరావు కదా. నారాయణన్‌ను అన్యాయంగా అరెస్టు చేయడం వల్ల ఇస్రో రెండు దశాబ్దాలు వెనకపడిందనేది శాస్త్రవేత్తల అభిప్రాయం.

### ఇస్రో గూఢచర్యం కేసు.. మాజీ పోలీసులపై సీబీఐ అభియోగాలు

అంతరిక్ష శాస్త్రవేత్త నంబి నారాయణన్ గూఢచర్యానికి పాల్పడ్డారంటూ 1994లో కల్పిత కేసును రూపొందించిన కేసుకు సంబంధించి అయిదుగురు మాజీ పోలీసు అధికారులపై సీబీఐ ఈ ఏడాది జూన్లో అభియోగాలు నమోదు చేసింది. ఆ అధికారుల్లో కేరళ, గుజరాత్ డీజీపీలుగా పదవీ విరమణ చేసిన సిబి మాథ్యూ, ఆర్.బి.శ్రీకుమార్ ఉన్నారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 2021లో సీబీఐ కేసు నమోదు చేసింది. ఇస్రో గూఢచర్యం కేసుపై ఆనాడు దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందాని(సిట్)కి మాథ్యూ నేతృత్వం వహించారు. ఆనాటి సిట్‌లో అప్పటి హోదాలతో ఇతర సభ్యులుగా ఆర్.బి.శ్రీకుమార్ (డిప్యూటీ డైరెక్టర్-ఇంటెలిజెన్స్ బ్యూరో), పి.ఎస్.జయప్రకాశ్ (ఎస్ఐబీ-కేరళ), డీఎస్పీ కె.కె. జోషువా, ఇన్‌స్పెక్టర్ ఎస్. విజయన్ ఉన్నారు.

### నంబియార్ జీవితంపై సినిమా..

ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం గురించి తొలిసారి రూపొందిన సినిమా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'. ప్రముఖ నటుడు ఆర్. మాధవన్ దర్శకుడిగా మారి, తెరకెక్కించిన తొలి చిత్రమిది. ఈ ఏడాది జులై 1న విడుదలైంది.






### నిరపరాధిగా నిరూపితమై మళ్లీ ఇస్రోలోకి..

వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఇన్ని అవమానాలు ఎదురైనా నారాయణన్ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. 'నిజం దాచినా దాగదు. చివరకు గెలిచేది న్యాయమే' అనే ధోరణితో పోరాటం చేశారు. నారాయణన్ కేసు కొన్ని రోజుల తర్వాత కేరళ ఇంటిలిజెన్స్ బ్యూరో నుంచి సీబీఐకు బదిలీ అయ్యింది. ఇస్రోలో తాను చూస్తున్న వ్యవహారాలకు సంబంధించి ఎలాంటి సమాచారమూ బయటకు ఇవ్వలేదని నారాయణన్ సీబీఐ అధికారులకు స్పష్టం చేశారు. 1995 జనవరి 19న నారాయణన్‌కు బెయిల్ మంజూరైంది. ఈయనతోపాటు అభియోగాలు ఎదుర్కొన్న మరో ఐదుగురూ నిర్దోషులని 1996లో సీబీఐ ప్రకటించింది. ఇస్రోకు సంబంధించిన సమాచారమేదీ పాకిస్థాన్‌కు వెళ్లినట్టు ఎలాంటి ఆధారాల్లేవని వెల్లడించింది. క్రయోజెనిక్ ఇంజిన్ల ప్రణాళిక చోరీకి గురికాలేదని ఇస్రో చేపట్టిన అంతర్గత దర్యాప్తులోనూ స్పష్టమైంది. మీడియా, నారాయణన్ పై నిందలు మోపిన వారంతా తమ పొరపాటును తెలుసుకున్నారు. అలా నిర్దోషిగా నిరూపితమైన నారాయణన్ మళ్లీ ఇస్రోలో అడుగుపెట్టారు. అయినా పరిస్థితి అంతకు ముందులా లేదు. స్థానిక ప్రభుత్వం మళ్లీ కేసును తెరిచేందుకు ప్రయత్నించింది. సుప్రీం కోర్టుకు వెళ్లగా 1998లో దేశ అత్యున్నత న్యాయస్థానం ఆ కేసును తిరస్కరించింది.



## ఊహించని పరిణామంతో 50రోజులు జైల్లో..

1994లో తన జీవితం తలకిందులయ్యే వరకూ స్వదేశీ రాకెట్ల తయారీ కోసం ఎనలేని కృషి చేశారు నారాయణన్. అది 1994 నవంబరు 30. నారాయణన్ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో క్రయోజెనిక్ రాకెట్ ఇంజిన్ తయారీ ప్రాజెక్టుకు సారథిగా వ్యవహరిస్తున్న రోజులవి. ఆ ఇంజిన్ తయారీకి సంబంధించిన సాంకేతికతను రష్యా నుంచి తీసుకురావడానికి ఆయన బాధ్యులుగా ఉన్నారు. ఓ రోజు మధ్యాహ్నం కేరళలోని తిరువనంతపురంలో ఉన్న ఆయన నివాసానికి ముగ్గురు పోలీసులు వచ్చారు. వారు చాలా మర్యాదగా, గౌరవంగా మాట్లాడుతున్నారు.తమ బాస్ డీఐజీ (పోలీసు) మీతో మాట్లాడాలని అనుకుంటున్నారని వారు చెప్పారు."నన్ను అరెస్టు చేశారా?" అని నారాయణన్ అడిగారు."లేదు సార్" అని పోలీసులు అన్నారు.బయట ఆగి ఉన్న పోలీసు జీపు దగ్గరికి నారాయణన్ నడుచుకుంటూ వెళ్లారు. జీపులో ముందు కూర్చోవాలా? వెనకనా? అని ఆయన అడిగారు. సాధారణంగా అనుమానితులను పోలీసులు జీపు వెనుక సీటులో కూర్చోమంటారు. ముందే కూర్చోండని పోలీసులు చెప్పారు. జీపు పోలీసు స్టేషన్‌కు చేరుకుంది. కానీ, అక్కడ పోలీసు బాస్ లేరు. దాంతో, ఆ అధికారి వచ్చేదాకా నారాయణన్‌ను అక్కడే బెంచీ మీద సాధారణ వ్యక్తిలా కూర్చోబెట్టారు.ఏదో నేరం చేసినవాళ్లను చూసినట్లుగా అందరూ ఆయనను అదో రకంగా చూస్తున్నారు.గంటల తరబడి ఆయన అక్కడే కూర్చోవాల్సి వచ్చింది. కానీ, ఆ పోలీస్ బాస్ రావట్లేదు. చీకటి పడింది. రాత్రంతా ఆ బెంచ్ మీదే పడుకున్నారు. సినిమాల్లో చూపించినట్టు డ్రామా క్రియేట్ చేసిన పోలీసులు ' ఉదయం లేవగానే, మిమ్మల్ని అరెస్టు చేశామని చెప్పారు. అప్పుడు నారాయణన్‌కు ఏం అర్థంకాలేదు. అంతా అయోమయ పరిస్థితి. అసలు ఏం జరిగిందంటే..వీసా గడువు ముగిసిన తర్వాత కూడా భారత్‌లోనే ఉన్నారంటూ మాల్దీవులకు చెందిన మహిళ మరియమ్ రషీదాను కేరళ పోలీసులు అరెస్టు చేశారు. ఇది ఆయన అరెస్టుకు నెల రోజుల ముందు జరిగింది. అనంతరం కొన్ని వారాల తర్వాత ఆమె స్నేహితురాలు ఫయూజియ్యా హసన్‌ను కూడా అరెస్టు చేశారు.మాల్దీవులకు చెందిన ఆ మహిళలు గూఢచారులని, భారత రాకెట్ రహస్యాలను తస్కరించి దొంగచాటుగా పాకిస్తాన్‌కు అమ్ముతున్నారని, వారికి ఇస్రోలో పనిచేసే శాస్త్రవేత్తలు సహకరిస్తున్నారని పోలీసులు చెప్పినట్లు స్థానిక పత్రికలు రాశాయి.ఆ మహిళలు వేసిన వలలో పడిన శాస్త్రవేత్తల్లో నంబి నారాయణన్ కూడా ఉన్నారని అప్పుడు పోలీసులు ఆరోపించారు. అలా ఆయన పోలీసు స్టేషన్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న రష్యా క్రయోజెనిక్ ఇంజిన్ టెక్నాలజీ ఒప్పందాన్ని వెనక్కితీసుకుంది.అప్పటికే ఈ విషయం కాస్తా మీడియాకు చేరింది. చూస్తుండగానే అనేక మంది జర్నలిస్టులు వచ్చారు. దేశద్రోహానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారంటూ వార్తా పత్రికలు రాశాయి. ఆయన పాకిస్తాన్‌కు రాకెట్ సాంకేతికతను అమ్మారని, మాల్దీవులకు చెందిన ఇద్దరు మహిళలు వేసిన హనీ ట్రాప్‌లో పడిపోయిన ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారంటూ పతాక శీర్షికల్లో ప్రచురించాయి. నిజానిజాలు తెలుసుకోకుండా పత్రికలు ఇష్టమొచ్చినట్టు నారాయణన్ నేరస్థుడంటూ కథనాలు రాశాయి. అంతే, ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఉన్నత శిఖరాన్ని అధిరోహించిన నారాయణన్ జీవితం తల్లకిందులైంది. దేశం కోసం శ్రమించిన ఆయనపై దేశద్రోహి అనే ముద్ర పడింది. ఈ ఘటన సంచలనమైంది.నారాయణన్‌ను అరెస్టు చేసిన తర్వాత పోలీసులు ఆయన్ను కోర్టులో హాజరుపరిచారు."నేరాన్ని అంగీకరిస్తున్నారా? అని న్యాయమూర్తి నన్ను అడిగారు. 'నేరం ఏంటి?' అని నేను ప్రశ్నించాను. మీరు రాకెట్ సాంకేతికతను బదిలీ చేశారు కదా అని జడ్జ్ అన్నారు. నాకేమీ తెలియదు అని చెప్పాను" అని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆయనకు న్యాయమూర్తి 11 రోజుల కస్టడీ విధించారు.తర్వాత కొన్ని నెలల్లో ఆయనకు ఉన్న గౌరవం, ప్రతిష్ట అన్నీ దెబ్బతిన్నాయి. భారత అధికారిక రహస్యాల చట్టాన్ని ఉల్లంఘించారని, అవినీతికి పాల్పడ్డారని ఆయన మీద అభియోగాలు నమోదు చేశారు.ఆయనపై విచారణ అధికారులు చేయిచేసుకున్నారు. చేతులకు బేడీలు వేసి పడుకోబెట్టారు. 30 గంటల పాటు నిలబెట్టి ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని వేధించారు. లై డిటెక్టర్ పరీక్షల ఫలితాలను భారత కోర్టుల్లో ఆధారంగా పరిగణించరు. అయినా, ఆయనకు ఆ పరీక్షలు కూడా చేశారు.తర్వాత భారీ భద్రత ఉన్న జైలులో బంధించారు. అందులో ఆయన్ను ఒక 'సీరియల్ హంతకుడి'తో కలిపి ఉంచారు.ఆ రాకెట్ రహస్యాలను 'పేపర్ ద్వారా బదిలీ చేయడం సాధ్యం కాదు' అని పోలీసులకు నారాయణన్ చెప్పారు. అదే విషయాన్ని ఆయన ఎప్పుడూ చెబుతూ వచ్చారు. వాస్తవానికి, అప్పటికి శక్తిమంతమైన రాకెట్ ఇంజిన్ల తయారీ కోసం క్రయోజెనిక్ టెక్నాలజీని అందిపుచ్చుకునేందుకు ఇంకా భారత్ తంటాలు పడుతోంది.నారాయణన్ దాదాపు నెల రోజులు జైలుతో కలిపి 50 రోజుల పాటు బందీగా గడిపారు. ఆయన్ను పోలీసులు కోర్టుకు తీసుకెళ్లిన ప్రతిసారీ అనేక మంది జనాలు ఆయన గూఢచారి, దేశద్రోహి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తుండేవారు. విచారణ పేరిట సంబంధిత అధికారులు నారాయణన్‌ను ఎన్ని హింసలు పెట్టారో అనుభవించిన ఆయన ఒక్కరికే తెలుసు. అయినా ఆయన సమాధానం ఒక్కటే 'నేను ఎలాంటి తప్పూ చేయలేదు'.